నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 14 ఏప్రిల్ 2025 | KHAMMAM

రజతోత్సవ విజయవంతానికి.. కార్యకర్తలు కంకణబద్ధులు కావాలి

పోస్టర్ల ఆవిష్కరణలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, నాయకులు

కొణిజర్ల, ఏప్రిల్ 13:ఈ నెల 27న వరంగ్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ విజయవంతానికి పార్టీ కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాలు పిలుపునిచ్చారు. రజతోత్సవ సభను సక్సెస్ చేసేందుకు కొణిజర్లలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ 25 వసంతాల వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పాతికేళ్ల బీఆర్ఎస్ ప్రస్తానాన్ని, స్ఫూర్తిని రజతోత్సవ సభ ద్వారా భావితరాలకు చెప్పనున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ 14 ఏళ్ల ఉద్యమ చరిత్రను, పదేళ్ల సుపరిపాలనను, భవిష్యత్‌కు బీఆర్ఎస్ అవసరాలను ప్రస్ఫుటించేందుకు ఈ సభ వేదిక కానుందన్నారు. అనంతరం సభ పోస్టర్లు ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు బోడపోతుల బాబు, కిలారు మాధవరావు, పాముల వెంకటేశ్వర్లు, జడ మల్లేశ్, మీర్జారోషన్‌బేగ్, రాయల నాగేశ్వరరావు, బాబులాల్, మీటు, జీడయ్య, రాము పాల్గొన్నారు.

వాడవాడలా వాల్‌రైటింగ్స్.. గులాబీ శ్రేణుల్లో నూతన జోష్..

- బీఆర్ఎస్ రజతోత్సవాలకు ఖమ్మం రూరల్‌లో ముమ్మర ప్రచారం
- మండలంలో మకాం వేసి పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే 'కందాళ'

ఖమ్మం రూరల్ మండలంలో వాల్ రైటింగ్ చేస్తున్న ఆర్టిస్టులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13:ఈ నెల 27న వరంగ్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం ఖమ్మం రూరల్ మండలంలో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సభ సక్సెస్ కోసం వాడవాడలా వాల్‌రైటింగ్స్ కార్యక్రమం చేపట్టడంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. రజతోత్సవ జయప్రదానికి మండలంలో చేపట్టిన విస్తృత ప్రచారాన్ని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి.. ఇక్కడే మకాం వేసి మరీ పర్యవేక్షిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయన ఆదేశాలకు అనుగుణంగా.. తీవ్ర కసరత్తులు చేస్తున్నారు. మూడు రోజులుగా మండలంలోని ప్రధాన జాతీయ రహదారులు, గ్రామాల్లో విరివిగా వాల్‌రైటింగ్స్ చేస్తున్నారు. 'జై తెలంగాణ', 'జై కేసీఆర్', 'జై కందాళ' నినాదాలను గోడలపై రాస్తున్నారు. 'చలో వరంగల్', 'బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి' అంటూ రంగులతో కూడిన పిలుపుల నినాదాలను గోడలపై రాస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కందాళ కూడా రజతోత్సవాల జయప్రదం కోసం నాలుగు రోజులుగా మండలాల శ్రేణులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు.

తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష

- బీఆర్ఎస్ రజతోత్సవ సభలో సత్తుపల్లి నియోజకవర్గ సత్తా చాటుదాం
- పెనుబల్లి సమావేశంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెనుబల్లి, ఏప్రిల్ 13: కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. పెనుబల్లి మండలం ముత్తగూడెంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పండుగలా నిర్వహించబోతున్నామని అన్నారు. ఈ సభలో సత్తుపల్లి నియోజకవర్గ సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. రజతోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది కేసీఆర్, కేటీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశానికి ముందుగా ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు, చెక్కిలాల మోహన్‌రావు, లక్కినేని అలేఖ్య, వినీల్, చెక్కిలాల లక్ష్మణరావు, నాగిరెడ్డి, తిరుమలరెడ్డి, నాగదాసు, కోటగిరి సుధాకర్, బాబు, తడికమల్ల శేఖర్, బండారుపల్లి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, రాధాకృష్ణ, తన్నీరు కృష్ణ, కొత్తగుండ్ల అప్పారావు, సీతారాములు, రాయపూడి మల్లయ్య, సూరపురెడ్డి కిరణ్‌రెడ్డి, ఏటుకూరి వెంకట అప్పారావు, తుమ్మలపల్లి రమేశ్, పోతురాజు కృష్ణారావు, బెల్లంకొండ చలపతిరావు, లగడపాటి శ్రీనివాసరావు, తావునాయక్, చిలుకూరు వెంకటరామారావు, గాయం వెంకటేశ్వరరావు, తెలగొర్ల జనార్దన్, కోట ప్రభాకర్, వాంకుడోతు మురళి, పర్సా వెంకటనారాయణ, పసుమర్తి వెంకటేశ్వరరావు, వంగా చంద్రశేఖర్, మరకాల చంటి, మరకాల వెంకీ తదితరులు పాల్గొన్నారు.

హరిత ప్రేమికుడికి.. కన్నీటి వీడ్కోలు

- వనజీవిని కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- పాడెమోసిన ఖమ్మం రూరల్ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్
- చివరిగా వీడ్కోలు పలికిన ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్
- అధికారుల పర్యవేక్షణ.. కానీ కానరాని అధికారిక లాంఛనాలు..

రెడ్డిపల్లిలో వనజీవి అంతిమయాత్రలో పాల్గొన్న రామయ్య అభిమానులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13:హరిత ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి (దరిపెల్లి) రామయ్యకు ప్రకృతి ప్రేమికులు, గ్రామస్తులు, అధికారులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామయ్య.. ఈ నెల 12న తెల్లవారుజామున రామయ్య తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూసిన విషయం విదితమే. ఆదివారం అతడి స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు రామయ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. రామయ్య తుదిశ్వాస విడిచిన దగ్గర నుంచి మొదలుకొని ఆఖరి మజిలీ పూర్తయ్యే వరకూ ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు స్వయంగా అన్ని ఏర్పాట్లూ ఏర్పాచేశారు. అంత్యక్రియల సందర్భంగా స్వయంగా పాడె మోశారు. రామయ్య పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వనజీవి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే జరిగినప్పటికీ అధికారిక లాంఛనాలతో మాత్రం జరగలేదు.

రామయ్య పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటిస్తున్న డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

అంత్యక్రియల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు రెడ్డిపల్లిలోని రామయ్య ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర.. మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్ చివరిసారిగా రామయ్య పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అటవీశాఖ సిబ్బంది పరేడ్ అనంతరం అంతక్రియలు ముగిశాయి. అంతిమయాత్రలో పాల్గొన్న సామాజిక వేత్తలు వనజీవితో వారికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని శోకసంద్రంలో మునిగిపోయారు. రామయ్య అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అక్కడి వైకుంఠధామంలో ఆయన అభిమానులు మొక్కలు నాటారు. ఆర్‌డీవో నర్సింహారావు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, ప్రముఖ సామాజిక వేత్తలు సురేశ్ గుప్తా, గడ్డం రాజశేఖర్, జిల్లా ఆసపత్రుల సమన్వయకర్త డాక్టర్ కేసగాని రాజశేఖర్, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి నివాళి..

పద్మశ్రీ వనజీవి రామయ్య పార్థివదేహానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, నీటిపారుదల, అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు ఆదివారం ఉదయం రెడ్డిపల్లిలోని రామయ్య ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం రామయ్య సతీమణి జానకమ్మను పొంగులేటి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీపీ సునీల్ దత్, ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన రామయ్య సతీమణి..

మరికాసేపట్లో వనజీవి అంతిమయాత్ర ప్రారంభం కాబోతున్న సమయంలో ఆయన సతీమణి జానకమ్మ ఒక్కసారిగా సొమ్మసల్లి కుప్పకూలిపోయారు. దీంతో అక్కడే ఉన్న బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తెల్లవారుజాము నుంచి అక్కడే ఉన్న రామయ్య సన్నిహితుడు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ కేసగాని రాజశేఖర్ జానకమ్మకు అవసరమైన ప్రాథమిక వైద్యం అందించారు. వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి పరీక్షలు చేశారు. లో షుగర్, హై బీపీ కారణంతోనే సొమ్ముసిల్లపడిపోయినట్లు నిర్ధారించారు. అంబులెన్స్‌లో డాక్టర్ పర్యవేక్షణలో ఆమెను వైకుంఠధామానికి తీసుకొచ్చారు.





వేసవిలో వెతలు



- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నాన్ ఆయకట్టు ఏరియాలో ఎండుతున్న పంటలు
- ప్రధాన జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- గ్రామాల్లో మొదలైన తాగునీటి కష్టాలు
- నీటి కోసం అల్లాడుతున్న రైతులు, ప్రజలు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని అధికారులు

ఖమ్మం, ఏప్రిల్ 13: ఖమ్మం జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా వేసవిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఎండల తీవ్రతకు రోజురోజుకి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. దీంతో అటు ప్రజలు.. ఇటు రైతులు తాగు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనిపిస్తున్నది. పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడం వల్ల రైతులు బోర్లు వేస్తున్నా అవి పడటం లేదు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోవడం ఒక భాగమైతే.. చేతికొచ్చిన పంట ఆగమవుతుందనే బెంగ మరోవైపు రైతులను కుంగదీస్తున్నది. ఒక్కో బోరు వేయడానికి సగటున రూ.50 వేలు ఖర్చు అవుతుండగా.. నీళ్లు పడకపోవడం వల్ల ఒక్కో రైతు కనీసం నాలుగు బోర్లు వేస్తున్నాడు. ఏదో ఒక్కటైన పడి నీళ్లు వస్తాయనే ఆశతో అప్పు తెచ్చి మరీ బోర్లు వేస్తున్నారు. ఇటీవల ఖమ్మం రూరల్ మండలం, ఎం.వెంకటాయపాలెంకు చెందిన రైతు ఏకంగా తన చేలో నాలుగు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. ఖమ్మం జిల్లాలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురకవపోవడం వల్ల చెరువులు, కుంటలు నిండని పరిస్థితి ఉంది. ఐతే నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలోని చెరువులను మాత్రం సాగర్ నీళ్లతో నింపడం వల్ల వాటిల్లో కొద్దిగా నీరు ఉంది. తద్వారా వాటి ఆయకట్టు పరిధిలోని పంటలు చేతికొచ్చే అవకాశం మాత్రం ఉంది. సాగర్ ఆయకట్టులేని ప్రాంతాల్లోని రైతులు మాత్రం అగమ్యగోచరమైన స్థితిలో ఉన్నారు. వరి పంటలతోపాటు మిర్చి తోటలు కూడా ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లాలో 2024 మార్చిలో సరాసరి భూగర్భ జలాలు 6.86 మీటర్లు కాగా.. ఈ ఏడాది మార్చిలో 5.51 మీటర్లు ఉన్నవి. గత ఏడాది కంటే నీటిమట్టాలు పడిపోతున్నవి.

ఖమ్మం జిల్లాలో చెరువులు, కుంటలతోపాటు ప్రధాన జలాశయాలు మూడు ఉన్నాయి. వాటిలో పాలేరు, వైరా, లంకాసాగర్ ప్రాజెక్టు ఉండగా.. వీటిలో కూడా నీరు తగ్గుతూ వస్తున్నది. పాలేరు జలాశయం కెపాసిటీ 23 అడుగులు కాగా.. ప్రస్తుతానికి 22 అడుగులకు నీరు చేరింది. ఇక్కడి నుంచే ఖమ్మం కార్పొరేషన్‌కు తాగునీటి సరఫరా జరుగుతున్నది. ఈ జలాశయంలో నీటిమట్టం మరింత తగ్గితే ఖమ్మం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవు. అదేవిధంగా వైరా ప్రాజెక్టు కెపాసిటీ 17 అడుగులు కాగా.. ఇక్కడ 13 అడుగులు మాత్రమే నీరు ఉంది.. ఇక్కడ కూడా నీటిమట్టం మరింత తగ్గితే వైరా, మధిర నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవు. లంకాసాగర్ ప్రాజెక్టులో కూడా ఇదే పరిస్థితి ఉంది.

ప్రధాన జలాశయాల్లో తగ్గుతున్న నీటిమట్టం

ప్రమాదకరంగా భూగర్భ జలాలు

ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది భూగర్భ జలాలు తగ్గుతుండడంతో ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. సాగునీటి అవసరాలు ఈ నెలాఖరు నుంచి లేనప్పటికీ తాగునీటికి కటకట ఏర్పడే అవకాశం ఉంది. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా గత ఏడాదితో పోలిస్తే కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, బోనకల్, చింతకాని, ముదిగొండ, కొణిజర్ల, సింగరేణి, ఎర్రుపాలెం, రఘునాథపాలెం, సత్తుపల్లి, తల్లాడ మండలాల్లో భూగర్భ జలాలు తగ్గాయి. మార్చిలోనే ఈ విధంగా ఉంటే.. ఏప్రిల్, మే నెలలో మరింత కిందికి వెళ్లే ప్రమాదం ఉంది. తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

మండలం	2024 మార్చి	2025 మార్చి
ఖమ్మం అర్బన్	1.98	2.1
ఖమ్మం రూరల్	5.48	4.12
తిరుమలాయపాలెం	4.90	4.08
కూసుమంచి	5.95	3.9
నేలకొండపల్లి	4.73	1.73
బోనకల్లు	3.48	1.81
చింతకాని	6.16	3.17
ముదిగొండ	4.00	1.92
కొణిజర్ల	3.05	2.23
సింగరేణి	7.03	5.94
కామేపల్లి	10.92	10.83
మధిర	7.62	8.42
ఎర్రుపాలెం	10.23	9.07
వైరా	2.50	2.57
రఘునాథపాలెం	9.40	9.3
సత్తుపల్లి	18.15	15.4
వేంసూరు	7.45	6.46
పెనుబల్లి	6.75	5.28
కల్లూరు	3.63	3.22
తల్లాడ	4.86	2.98
ఏన్కూరు	10.06	8.52

దమ్మపేటలో మెరుపు

వడగండ్ల వాన

- దమ్మపేట, చండ్రుగొండల్లో కురిసిన వడగండ్లు
- దుమ్ముగూడెంలో తాటిచెట్టుపై పడిన పిడుగు
- చుంచుపల్లి మండలంలో తడిసిన ధాన్యం

ఉదయమంతా ఉక్కిరిబిక్కిర చేసిన అధిక ఉష్ణోగ్రత.. సాయంత్రానికి మటుమాయమైంది. అదే సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సరిగ్గా ఆ వెంటనే ఈదురుగాలులు ఊపందుకున్నాయి. ఆ కాసేపటికే వడగండ్ల వాన మొదలైంది. సుమారు గంట నుంచి మూడు గంటల పాటు విరామం లేకుండా కురిసింది. ఇదీ.. ఉమ్మడి జిల్లాలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా చోటుచేసుకున్న వాతావరణ మార్పు. అప్పటి వరకూ మండిన ఎండకు తల్లడిల్లిపోయిన జిల్లా ప్రజలు.. సాయంత్రం చల్లబడిన వాతావరణాన్ని ఆస్వాదించబోయారు. ఈలోపే గాలిదుమారం ఊపందుకోవడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. దమ్మపేట, చండ్రుగొండ, కొత్తగూడెం, రుద్రంపూర్, పాల్వంచల్లో వడగండ్ల వాన కురిసింది. దుమ్ముగూడెంలో తాటిచెట్టుపై పిడుగు పడింది. చుంచుపల్లి, బూర్గంపహాడ్, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ, దమ్మపేట, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లిల్లో ఈ అకాల వర్షం కారణంగా వివిధ పంటలు దెబ్బతిన్నాయి. పెనగడప కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అన్నపురెడ్డిపల్లి సహా మరికొన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రఘునాథపాలెం, చండ్రుగొండల్లో సుమారు రెండు సెంటీమీటర్ల పొడవున్న వడగండ్లు కురిశాయి. కాగా, దుమ్ముగూడెం మండలంలో ఆదివారం సాయంత్రం వర్షం తగ్గాక ఆకాశంలో హరివిల్లు ఆవిష్కృతమవడంతో ఆ అపురూప దృశ్యాన్ని స్థానికులు తిలకించి ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. – నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 13

బూర్గంపహాడ్: మోరంపల్లిబంజర్‌లో వర్షం పడుతుండడంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

కొత్తగూడెం: రుద్రంపూర్‌లో భారీ వర్షంతో పడుతున్న వడగండ్లు

చుంచుపల్లిలో తడిచిన ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు, తడిచిన ధాన్యాన్ని చూస్తున్న రైతు

చండ్రుగొండలో వడగండ్లు

దుమ్ముగూడెంలో కురుస్తున్న వర్షం, పిడుగుపడి దగ్ధమవుతున్న తాటిచెట్టు